

విద్యలో 'ఆదర్శ'ం
మోడల్ స్కూళ్లు పేద విద్యార్థులకు వరంగా మారాయి. 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. 8లో



మాట నిలబెట్టుకున్నాం
కౌకుంట్ల పంచాయతీ మైలారంపల్లి ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
40.4°/24.2°
జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం, ఉక్క పోత ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

ఐరావత వాహనంపై నృసింహుడి విహారం



ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం శ్రీవారిని ఐరావత వాహనంపై మేళతాళాల నడుమ మాఢవీధుల్లో ఊరేగించారు. ముందుగా స్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

12 వరకూ మొక్కజొన్న కొనుగోలుకు రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు విక్రయించేందుకు మొక్కజొన్న రైతులు ఈనెల 12లోపు ఆర్‌బీకే అసిస్టెంట్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా రూ.1,962 ప్రకారం కొనుగోలు చేసి మూడు వారాల్లో సొమ్ము రైతుల అకౌంట్లకు జమ చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 600 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. మంగళవారం నుంచి 17 కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియ కూడా ప్రారంభించామన్నారు. వెయ్యి మెట్రిక్ టన్నుల దాకా కొనుగోలు చేయాలని లక్ష్యం విధించుకున్నట్లు ఆమె వెల్లడించారు.

రహదారి భద్రత మెరుగుపర్చాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకుని రహదారి భద్రతను మెరుగుపరచాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా రహదారి భద్రత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతోందని, ఆ నిర్లక్ష్యం అధికారుల వైపు ఉండకూడదని చెప్పారు. ఐరాడ్ యాప్‌లో ప్రమాద వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తే రహదారి భద్రతకు మెరుగైన ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల అథారిటీ నిర్వహించే అంబులెన్స్ సర్వీసు టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కళాశాలలో కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీటీసీ శివరామప్రసాద్, ఏఎస్పీ నాగేంద్రుడు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబుళరెడ్డి, డీసీహెచ్ఎస్ కృష్ణవేణి, పంచాయతీరాజ్ అధికారులు, జాతీయ రహదారుల అథారిటీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేడు పాలిసెట్



అనంతపురం: ఏపీ పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష బుధవారం నిర్వహిస్తున్నట్లు సెట్ జిల్లా కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 9,806 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. అనంత పురంలో 13 పరీక్ష కేంద్రాల్లో 5,840 మంది, కళ్యాణదుర్గంలో 5 పరీక్ష కేంద్రాల్లో 1,551, తాడిపత్రి- 8 పరీక్ష కేంద్రాల్లో 1,695 మంది హాజరుకానున్నట్లు వివరించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష సాగుతుందని తెలిపారు.

సాగుకు హక్కు!

సాగులో ఉన్నామనే భావనే కానీ భూమిపై ఆ రైతులకు ఎలాంటి హక్కు ఉండేది కాదు. పంట నష్టపోతే అందాల్సిన పరిహారమూ వచ్చేది కాదు. భూమికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం పొందేందుకు కూడా వారు అనర్హులే. ఎప్పుడైనా కష్టమొస్తే బ్యాంకు నుంచి రుణం తీసుకునేందుకు పట్టా కూడా వారితో ఉండదు. ఇలాంటి అన్నదాతల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం అండగా నిలిచేందుకు అన్ని చర్యలూ తీసుకుంది. సర్కారు ఆశయాలకు అనుగుణంగా జిల్లా ఉన్నతాధికారులు అందుకు సంసిద్ధమయ్యారు.



జిల్లాలో లబ్ధిదారులు ఇలా...

రెవెన్యూ డివిజన్	రైతులు	ఎకరాలు
అనంతపురం	577	881.58
గుంతకల్లు	625	779.71
కళ్యాణదుర్గం	354	547.05
మొత్తం	1,556	2,208.34

- ప్రభుత్వ భూమి సాగుదారులకు త్వరలో పట్టాలు
- ప్రక్రియను సిద్ధం చేసిన రెవెన్యూ యంత్రాంగం
- జిల్లా వ్యాప్తంగా 1,556 మందికి లబ్ధి
- 2,208.34 ఎకరాల పంపిణీకి సన్నాహాలు

అనంతపురం అర్బన్: జీవనాధారంగా ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేద రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అండగా నిలిచేందుకు చర్యలు చేపట్టింది. భూ పంపిణీ ద్వారా సాగుభూమిపై హక్కు కల్పిస్తూ పట్టా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రక్రియ పూర్తి చేసింది. భూ పంపిణీ తేదీని ప్రభుత్వం ఖరారు చేసిన వెంటనే అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి కమిటీ చైర్మన్ అనుమతి తీసుకునేందుకు అధికారులు సన్నద్ధంగా ఉన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న పేద రైతులకు తరి రెండున్నర ఎకరాలు, మెట్ట ఐదు ఎకరాలకు మించకుండా డి- పట్టా ఇవ్వనున్నారు. ఇప్పటికే అర్హులైన 1,556 మంది రైతులు 2,208.34 ఎకరాల ప్రభుత్వభూమిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వీరందరికీ భూ పంపిణీ కింద పట్టాలు పంపిణీ చేస్తారు.

ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన కమిటీ

అభ్యంతరం లేని వ్యవసాయయోగ్యమైన ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా ఇచ్చేందుకు ప్రత్యేకంగా అసైన్‌మెంట్ కమిటీని (ఏసీ) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వ్యవహరిస్తారు. మెంబర్ కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్ ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ ఉంటారు. మెంబర్లుగా జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఆర్‌డీఓలు ఉంటారు. ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న రైతుల వివరాలను కమిటీ సమావేశంలో ఉంచి పట్టా ఇచ్చేందుకు కమిటీ ఆమోదం తీసుకుంటారు.

నిబంధనల మేరకు అర్హత ఇలా....

- రైతు తాను సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి తప్ప అతనికి ఇతరత్రా పట్టా భూమి ఉండకూడదు.
- సాగు చేసుకుంటున్న భూమికి ఇంతకు ముందు ఎవరికీ డి-పట్టా ఇచ్చి ఉండకూడదు.
- దరఖాస్తు చేసుకున్న రైతు పొందుపరిచిన భూమిలో తప్పనిసరిగా సాగు చేసుకుంటూ ఉండాలి.

ఏ భూములకు పట్టా ఇవ్వరంటే...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోరంబోకు భూములు, వాగులు, వంకలు, కొండలు, గుట్టలకు పట్టాలు ఇవ్వరు. వ్యవసాయయోగ్యమైన భూమిని మాత్రమే అసైన్ చేస్తూ డి-పట్టా ఇస్తారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయమే తరువాయి..



జిల్లావ్యాప్తంగా దాదాపు 2,208 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న 1,556 మంది రైతులను అర్హులుగా గుర్తించాం. భూ పంపిణీ తేదీని ప్రభుత్వం ఖరారు చేసిన వెంటనే అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి ఆమోదం తీసుకుంటాం.
– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

అప్రమత్తంగా ఉండండి

- డీఐజీ అమ్మిరెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

ఉరవకొండ రూరల్: నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. ఉరవకొండ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ కాఫీ విత్ మెన్ కార్యక్రమం ద్వారా సిబ్బంది ఆలోచనలు అధికారులకు తెలుస్తాయన్నారు. ప్యాట్రోలింగ్ ద్వారా కేసులు తగ్గుముఖం పడతాయని తెలిపారు. కర్ణాటక ఎన్నికల దృష్ట్యా ప్రతి బార్డర్ చెక్‌పోస్టు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఐలకు సూచించారు. అనంతరం విడపనకల్లు చెక్‌పోస్టును సీఐ శేఖర్‌తో కలిసి డీఐజీ పరిశీలించారు.

చీనీ టన్ను రూ.40 వేలు



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠ ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 779 టన్నులు అమ్మకానికి రాగా ఈ-నామ్ పద్ధతిలో వేలం వేశారు. గరిష్ఠం రూ.40 వేలు, కనిష్ఠం రూ.13 వేలు, సరాసరి రూ.24 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

'జగనన్నకు చెబుదాం' ఓ విప్లవం

- మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉష శ్రీచరణ్
- సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు



ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు, కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించి నిర్ణీత వ్యవధిలో నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' ఓ విప్లవాత్మక కార్యక్రమం అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ అన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మంగళవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంత్రితో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కలెక్టర్ ఎం.గౌతమి, ఉద్యానశాఖ కమిషనర్ ఎస్.ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, మేయర్ వసీం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి, విప్, కలెక్టర్ మాట్లాడారు. సమస్యను 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి చెబితే... కాల్‌సెంటర్ ప్రతినిధి రికార్డు చేస్తారన్నారు. సమస్య నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి వెళుతుందన్నారు. ప్రతి వినతినీ పరిష్కారమయ్యే వరకూ పర్యవేక్షిస్తారన్నారు. ప్రభుత్వ సేవలు పొందడంలో ఏవేని సమస్యలుంటే తెలియజేయవచ్చన్నారు. సంక్షేమ పథకాలు, రేషన్ కార్డు, పెన్షన్ కానుక, ఆరోగ్యశ్రీ, రెవెన్యూ సేవలు పొందడంలో సమస్య వచ్చినా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా ఎప్పటికప్పుడు ఫిర్యాదుల స్థితి, పరిష్కార ప్రక్రియను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎంఉమాదేవి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌గర్ రిజ్వాన్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి ప్రారంభం

- ఉమ్మడి జిల్లాకు 1,78,907 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయింపు
- 15 నుంచి ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్లు!



బెళుగుప్పలో విత్తనశుద్ధిని పరిశీలిస్తున్న ఏడీఏ యల్లప్ప

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో విత్తనశుద్ధి (ప్రాసెసింగ్) ప్రారంభమైంది. ఖరీఫ్‌లో పంటల సాగుకు వీలుగా ఈ నెలాఖరున రాయితీతో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నారు. జిల్లాకు కే-6 రకం 76,700 క్వింటాళ్లు, 1812 రకం 1,300 క్వింటాళ్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు కే-6 రకం 99,457 క్వింటాళ్లు, 1812 రకం 1,450 క్వింటాళ్లు... మొత్తంగా రెండు జిల్లాలకు 1,78,907 క్వింటాళ్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ ప్రకటిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కే-6 రకం రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద 30 కిలోల బస్తాకు రూ.1,674, 30 కిలోల 1812 రకం రాయితీ పోనూ బస్తాకు రూ.1,494 ప్రకారం చెల్లించాలి. దీంతో పాటు 50 శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నారు. త్వరలో కందులు, రాగులు కూడా రాయితీతో ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి.

రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో..

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్లలోనే మంగళవారం విత్తన వేరుశనగ శుద్ధిని ప్రారంభించారు. గురువారం నుంచి పూర్తి స్థాయిలో విత్తన శుద్ధి జరుగుతుందని డీఏఓ బి.చంద్రానాయక్, ఏపీ సీడ్స్ డీఎం జే.ధనలక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు, గుత్తి, లోలూరు, బెళుగుప్పలో ఒక్కోటి, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో రెండు, కదిరిలో ఒక ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటు చేశారు. నాణ్యమైన విత్తనం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో విత్తనశుద్ధిని పర్యవేక్షించడానికి వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఒక వైపు ప్రాసెసింగ్ చేస్తూనే మరోవైపు ఆర్‌బీకేలకు సరఫరా చేయనున్నారు. ఈనెల 15 నుంచి ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటే సకాలంలో అందజేస్తారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

'సప్లి'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈఓ సాయిరాం

గార్లదిన్నె: సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పది ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ఈ విషయంగా శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు డీఈఓ సాయిరాం సూచించారు. గార్లదిన్నెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జేవీకే కిట్లు, పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ..పాఠశాలలు ప్రారంభమైన వెంటనే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేయాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించి తీరాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఈఓ చంద్రానాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్: పండ్ల మొక్కల సాగుకు ఈ నెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 5 ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతులు అర్హులన్నారు. మే 30 నుంచి రైతుల పొలాల్లో పండ్ల మొక్కల పెంపకం పనులను ప్రారంభిస్తామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రైతుల డిమాండ్‌ను బట్టి మరో 4 వేల ఎకరాలను పెంచుతూ మొత్తంగా 12 వేల ఎకరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను అభివృద్ధి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి పరిపాలన అనుమతులు మంజూరు చేశారన్నారు. మండల కేంద్రాల్లోని ఉపాధి హామీ కార్యాలయాల్లో రైతులు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సబ్ రిజిస్ట్రార్ అలీ సస్పెన్షన్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్‌రిజిస్ట్రార్ అలీపై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటు పడింది. అనంతపురం రూరల్ కార్యాలయంలో వారం క్రితం ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో సబ్‌రిజిస్ట్రార్ అలీ అక్కడి నుంచి వెళ్లిపోయినా, తనిఖీలు కొనసాగించారు. అలీ బంధువైన ఇస్మాయిల్ నుంచి రూ.2.30 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాలుగు రోజుల తర్వాత తిరిగి విధుల్లో చేరిన అలీ మళ్లీ 'మామూలు' బాటే పట్టడంతో ఉన్నతాధికారులు కణేకల్లుకు బదిలీ చేశారు. ఈ క్రమంలోనే అలీపై విచారణ చేయించిన కలెక్టర్.. అతడిని తక్షణమే సస్పెండ్ చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ మాధవికి ఆదేశాలు జారీచేశారు. ఆ మేరకు మంగళవారం డీఐజీ ఉత్తర్వులిచ్చారు. అయితే, ఉత్తర్వుల కాపీలు తీసుకోకుండానే అలీ వెళ్లిపోయినట్లు తెలిసింది.

ప్రతి ఫైలుకూ మామూళ్లే! : జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి చిరునామాగా మారాయి. అనంతపురం అర్బన్ కార్యాలయంలో చివరకు పెళ్లి సర్టిఫికెట్లకు కూడా రూ. వెయ్యి నుంచి రూ.మూడు వేలు తీసుకుంటున్న పరిస్థితి. డాక్యుమెంట్లు సరిగానే ఉన్నా ఏదో కొర్రీ వేయడం, డబ్బులిస్తే రిజిస్ట్రేషన్ చేయడం పరిపాటిగా మారింది. డాక్యుమెంటు రైటర్లు, సబ్ రిజిస్ట్రార్లు లోపాయికారి ఒప్పందంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరి నుంచి భారీగా డబ్బు గుంజుతున్నారు. తాజాగా కాగ్ నివేదికలోనూ జిల్లాలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో మరికొంతమంది సబ్‌రిజిస్ట్రార్‌లపైనా ఏసీబీ నిఘా ఉంచినట్లు సమాచారం.

రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు

- జిల్లా సివిల్ సప్లై డీఎం నీలమయ్య

కణేకల్లు: కణేకల్లు చెరువుతోపాటు వివిధ గ్రామాల్లో బోర్లకింద రబీలో సాగు చేసిన వరిధాన్యాన్ని రెండు, మూడు రోజుల్లో కొనుగోలు చేయనున్నట్లు జిల్లా సివిల్ సప్లై డీఎం నీలమయ్య తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి జాయింట్ కలెక్టర్‌తో చర్చించారన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం రూ.2,060, సాధారణ రకం రూ.2,040 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలుకు చర్యలు తీసుకోవడంతో బహిరంగ మార్కెట్లో ధరలు నిలకడగా ఉన్నాయన్నారు. ఎంఎస్‌పీ ప్రకటించకుంటే పతనమయ్యేవని వివరించారు. బహిరంగ మార్కెట్లో రూ. 50 నుంచి 100 ఎక్కువగా ఉండటంతో చాలామంది అటువైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసిందని, అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

రైల్వే శాఖలో బదిలీలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని రైల్వే శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆ శాఖ డివిజన్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రైల్వే స్టేషన్‌లోని కమర్షియల్ విభాగంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ రాంబాబును కదిరికి, తిమ్మప్పను తాడిపత్రికి, ప్రసాద్‌రెడ్డిని ధర్మవరానికి బదిలీ చేశారు. అలాగే కర్ణాటకలోని రాయచూర్‌లో పనిచేస్తున్న షమీనా తాజ్‌ను అనంతపురానికి, ధర్మవరం నుంచి శ్రీనివాసులును అనంతపురానికి బదిలీ చేశారు.

ఫుడ్‌పాయిజన్‌తో 13 మందికి అస్వస్థత



ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శిస్తున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, కాపు భారతి



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట/రాయదుర్గం: ఫుడ్‌పాయిజన్ కారణంగా 13 మంది అస్వస్థతకు గురైన ఘటన గుమ్మఘట్ట మండలం బేలోడులో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మారెక్క, రంగప్ప, లక్ష్మీదేవి, తిప్పేస్వామి,భరత్,భాస్కర్, లక్ష్మీ, వైష్ణవి, మాణిక్యమ్మ, లక్ష్మీ తదితరులకు మంగళవారం ఉదయం వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే వారంతా రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప బాధితులను పరామర్శించారు.

గ్రామంలో వైద్యశిబిరం..

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బేలోడులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లో వాటర్ శాంపిళ్లు పరీక్షించగా నీరు కలుషితం కాలేదని తేలిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత తెలిపారు. గ్రామంలో హోటల్ నిర్వహించే మాణిక్యమ్మ వంటల కోసం నూనెను మరలా మరలా వాడడం, ఆ వంటలను వీరంతా తినడంతోనే ఫుడ్ పాయిజన్ అయిందని నిర్ధారించినట్లు వైద్యులు రమేష్, డీఎల్‌డీఓ రఘురామారావ తెలిపారు.

అండగా ఉంటా.. అధైర్య పడొద్దు

బేలోడు ఘటన గురించి తెలుసుకున్న విప్ కాపు రామచంద్రారెడ్డి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి ఫోన్ ద్వారా పరిస్థితిని వివరించారు. అనంతపురంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఉన్న ఆయన అక్కడి నుంచే ఆర్డీఓతో మాట్లాడి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. అనంతరం జిల్లాకేంద్రం నుంచి నేరుగా ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. బాధితులు ఒక్కొక్కరికి ఖర్చుల నిమిత్తం రూ.వెయ్యి చొప్పున అందించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ మాధవిని ఆదేశించారు.

క్లుప్తంగా

'జగనన్నకు చెబుదాం' సద్వినియోగం చేసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1902కు కాల్ చేసి సమస్య వివరించాలని జిల్లా ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో ఏమైనా లోపాలు ఉన్నా, రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ తదితర ప్రభుత్వ శాఖల సేవల్లో జాప్యంపై నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ తరహా ప్రక్రియను చేపట్టలేదని, ఏకపక్ష ధోరణులతో ప్రజావ్యతిరేక పాలన సాగించాయన్నారు. ఇందుకు భిన్నంగా ప్రజాసమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సీఎం వైఎస్ జగన్ తీసుకున్న గొప్ప నిర్ణయాన్ని స్వాగతించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గుంతకల్లులో చైన్‌స్నాచింగ్

గుంతకల్లు టౌన్: రైల్వే డివిజన్ కేంద్రం గుంతకల్లులో చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. ఓ మహిళ కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని శాంతి నగర్ రైల్వే క్వార్టర్స్ – 558లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి రాజేంద్రకుమార్ భార్య వి.బిజిత మంగళవారం ఉదయం ఇంటి ఎదుట శుభ్రం చేసి, ముగ్గు వేస్తోంది. ఆ సమయంలో వాకింగ్ చేస్తున్నట్లుగా అటుగా వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె కళ్లలోకి కారం చల్లి, మెడలోని 3 తులాల బంగారు తాళిబొట్టు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో భర్త రాజేంద్ర, చుట్టుపక్కల వారు బయటికి వచ్చేలోపు చైన్‌స్నాచర్లిద్దరూ రైల్వే ఆస్పత్రి వైపు పరుగు తీసి, కనిపించకుండా పోయారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య.. అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుంతకల్లు: పట్టణ శివారులోని ఎంబీఏ కళాశాల సమీపంలో కల్లూరు రైలు మార్గంలో పట్టాలపై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న పురుషుడిగా నిర్ధారించారు. చామనఛాయ రంగులో ఉండి గడ్డం బాగా పెరిగి ఉంది. పింక్ కలర్ రెడీమేడ్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించాడు. లభ్యమైన ఆధారాలను బట్టి ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తోంది. సంబంధీకులు ఎవరైనా ఉంటే 94406 27667, 98661 44616 సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

విద్యలో ఆదర్శం

- భవితకు బంగారు సోపానంగా మారిన ఏపీ మోడల్ స్కూళ్లు
- ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు చేసుకున్న పాఠశాలలోనే జూన్ 11న ప్రవేశ పరీక్ష
- ఒక్కొక్క పాఠశాలలో 100 సీట్ల కేటాయింపు

రాప్తాడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిష్ బాషపై పట్టు తప్పనిసరి. ఆంగ్లంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పూర్తి స్థాయి పట్టు ఉన్న వారు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉంటున్నారు. ఈ క్రమంలో కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో ప్రభుత్వ పాఠవాల విద్యార్థులు పోటీ పడలేకపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి... తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో ఏపీ ఆదర్శ పాఠశాలలను 2013లో ప్రారంభించారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా నేడు ఆదర్శ పాఠశాలలు విప్లవాత్మక ఫలితాలను సాధిస్తున్నాయి. గత విద్యాసంవత్సరానికి గాను ఈ ఏడాదిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,929 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,392 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అత్యధికులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

2022–23 విద్యా సంవత్సరానికిగాను ఏపీ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు జగన్ సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 9 నుంచి ఆన్‌లైన్‌లో మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 25తో ముగియనుంది. పూర్తి వివరాలు, దరఖాస్తుల అప్‌లోడ్‌కు https://apms. apcfss.in/ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూళ్లలోనే జూన్ 11న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. జూన్ 16న మెరిట్ జాబితా ప్రకటిస్తారు. మెరిట్ లిస్టను బట్టి రోస్టర్ ప్రామాణికంగా సీట్లను కేటాయిస్తూ జూన్ 18న జాబితాను విడుదల చేస్తారు. 19న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుంది. జూన్ 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 25 ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటు కాగా, ఒక్కో పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు గతంలో 80 సీట్లు మాత్రమే భర్తీ చేసేవారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌కు జగన్ సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ ఏడాది వంద సీట్లకు పెంచింది. ఈ లెక్కన 25 పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు దక్కనున్నాయి. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలున్నాయి. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఆదర్శ పాఠశాల లేని మండలాల్లోని విద్యార్థులు సమీప మండలాల ఆదర్శ పాఠశాలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. సొంత మండల విద్యార్థులు లేని పక్షంలో పక్క మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. బాలికలకు పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం ఉంది.



రాప్తాడులోని ఆదర్శ పాఠశాల

ఇంటర్ వరకు ఉచితం



పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు ఆదర్శ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విశాలమైన తరగతి గదులు, మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ఈ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. అంతేకాక మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా ఆదర్శ పాఠశాలల్లో అధునాతన మౌలిక వసతులు సమకూరాయి. ఆదర్శ పాఠశాలలో ఒక్కసారి సీటు దక్కితే ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ అన్ని ఉచితమే. ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలనే తపన ఉండే గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పద్మజా దేవి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, రాప్తాడు

వివాహిత దుర్మరణం



మృతురాలు పల్లవి

రాయదుర్గం టౌన్: ప్రైవేట్ ఆస్పత్రి అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం వడ్రవన్నూరు గ్రామానికి చెందిన శివన్న, పల్లవి (25) భార్యాభర్తలు. ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి కడుపునొప్పితో బాధపడుతున్న పల్లవిని ద్విచక్ర వాహనంపై రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి శివన్న తీసుకెళ్లాడు. తోడుగా పల్లవి సోదరుడు వినోద్‌ను వెంట పిలుచుకెళ్లాడు. చికిత్స అనంతరం అర్ధరాత్రి ముగ్గురూ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా... వడ్రవన్నూరు శివారులోకి చేరుకోగానే రాయదుర్గం నుంచి అనంతపురానికి వెళుతున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి అంబులెన్స్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన పల్లవి అక్కడికక్కడే మృతి చెందింది. శివన్న, వినోద్ గాయపడ్డారు. క్షతగ్రాతులను స్థానికులు వెంటనే రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనలపై రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

13న ఉద్యోగమేళా

అనంతపురం: ఈ నెల 13న నగర శివారులోని ఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మెడికల్ కోడింగ్, మెడికల్ బిల్లింగ్ (అడ్వాన్సెడ్ సర్టిఫికేషన్) ఉద్యోగాలకు సంబంధించి అర్హులైన వారిని చెన్నైలోని ఇండియన్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి సంబంధిత అంశాలపై 60 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. బీఫార్మసీ, ఎంఫార్మసీ, నర్సింగ్, బీడీఎస్, బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీపీటీ, ఎంపీటీ, బీఎంఎల్, బయో టెక్నాలజీ, బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, లైఫ్‌సైన్సెస్ గ్రాడ్యుయేట్స్(మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ, కెమిస్ట్రీ, జువాలజీ, బయాలజీ, న్యూట్రిషన్)కోర్సు పూర్తి చేసి, 19 నుంచి 32 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. ఎంపికైన వారికి ప్రాథమిక దశలో నెలకు 15 వేలు నుంచి 20 వేలు జీతం ఇస్తారు. తర్వాత ఐదేళ్లలో రూ.80 వేల వరకు జీతం అందజేస్తారు. ఎంపికైన వారు బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, చెన్నై, విజయవాడ, విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుంది. ప్రతిభ చాటుకున్న వారికి అమెరికా, యూకే, కెనడా, గల్ఫ్ దేశాల్లో పనిచేసే అవకాశం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 98400 14983, 77807 52418లో సంప్రదించవచ్చు.

సంచార జాతులకు ప్రభుత్వం పెద్దపీట

- సమస్యల పరిష్కారానికి చర్యలు
- గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న

గుంతకల్లు టౌన్: సంచారజాతుల అభ్యున్నతికి జగన్ సర్కార్ పెద్దపీట వేసిందని, వారి సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. పాత గుంతకల్లులోని వాల్మీకి కల్యాణమంటపంలో జిల్లా సంచారజాతుల సంఘం మహిళా అధ్యక్షురాలు చప్పిడి మేరీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే వైవీఆర్, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంచారజాతులను రాజ్యాంగ పరిధిలోకి చేర్చాలన్న అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. ప్రత్యేక కమ్యూనిటీ భవన నిర్మాణానికి 15 సెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. పెండ్ర వీరన్న మాట్లాడుతూ... వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఎంబీసీ కులాలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగంపై రాయితీ, జిల్లా ఎంబీసీ వెల్ఫేర్ బోర్డుల ఏర్పాటు, సంచార కులాలపై దాడులు బోటు చేసుకోకుండా ప్రత్యేక జీఓ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. 2008లో సంచారజాతుల జాతీయ కమిషన్ ఇచ్చిన నివేదిక మేరకు సంచార తెగలు, విముక్త జాతులను రాజ్యాంగం పరిధిలోకి చేర్చి ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంచారజాతుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ముద్రగడ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు కత్తి విజయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పీడిస్తే చర్యలు తప్పవు

అనంతపురం క్రైం: రోగులను పీడించి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంతకల్లు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఆయా ఆస్పత్రుల గుర్తింపును రద్దు చేస్తామని పేర్కొన్నారు. ప్రదర్శించిన ధరల పట్టిక మేరకే డబ్బు వసూలు చేయాలని ఆదేశించారు.

నేడు 'తపాలా' సొసైటీ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

అనంతపురం సిటీ: అనంతపురంలోని తపాలా ఉద్యోగుల పరస్పర సహకార సంఘం(కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ) అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి స్థానాలకు బుధవారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ మంగళవారం తెలిపారు. సొసైటీకి సంబంధించి 11 మంది డైరెక్టర్ల ఎంపికకు సంబంధించి ఈ నెల 7న ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. గెలుపొందిన డైరెక్టర్లలోనే ముగ్గురిని అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శిగా ఎన్నుకోనున్నారు. ఒకరు ప్రతిపాదిస్తే, మరొకరు బలపరచాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ రూరల్: కొంకుంట్ల గ్రామ పంచాయతీ మైలారంపల్లి గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చుకుంటూ ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో మైలారంపల్లి గ్రామానికి చెందిన 61 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఆయన అందజేసి, మాట్లాడారు. కొర్రకోడు డ్యాం పూర్తి స్థాయిలో నిండితే మైలారంపల్లి గ్రామంలోకి నీరు చేరుతుందని, గ్రామం పక్కనే ఉన్న కొండపై ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు పంపిణీ చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా స్థానికులు కోరుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ అంశాన్ని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పయ్యావుల కేశవ్ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆ గ్రామ ప్రజల బాగోగుల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గత ఏడాది డ్యాంకు పూర్తి స్థాయి నీటి మట్టం చేరుకోవడంతో గ్రామంలోకి నీరు చేరిందని, విషయం తెలుసుకున్న తాను, అధికారులతో కలసి గ్రామాన్ని సందర్శించి, బాధితుల పక్షాన నిలిచానని గుర్తు చేశారు. ఆ సమయంలో ఇచ్చిన మాట మేరకు కొండ గుట్టపై ఇంటి పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పట్టాలు పొందిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున గృహాలను నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీపీ చందాచంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్ పాల్గొన్నారు.

జగనన్న డీఎస్సీ–98 టీయూ ఆవిర్భావం

- జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



రెడ్డిపల్లి రామాంజనేయరెడ్డి, కె.నాగరాజు

రాప్తాడు రూరల్: జిల్లాలో కొత్తగా టీచర్స్ యూనియన్ ఆవిర్భవించింది. ఎంటీఎస్ కింద పరిగణిస్తూ ఎస్జీటీలుగా నియమితులైన డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులందరూ ఏకమై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కృతజ్ఞతతో 'జగనన్న డీఎస్సీ–98 (ఎంటీఎస్) టీచర్స్ యూనియన్' పేరుతో కొత్త యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఎంటీఎస్ టీచర్లందరూ మూడు రోజుల క్రితం అనంతపురంలో సమావేశమై ఉమ్మడి జిల్లా కమిటీ ఏర్పాటుపై చర్చించారు. ఈ క్రమంలో ఏకగ్రీవంగా ఎంపికైన ఉమ్మడి జిల్లా కమిటీని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా రెడ్డిపల్లి రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.నాగరాజు, గౌరవ సలహారులుగా ఎస్.ఈశ్వరరెడ్డి, టి.మల్లికార్జునరెడ్డి, కె.చెన్నకేశవులు, ఉపాధ్యక్షులుగా ఎన్.వేణుగోపాల్, సీహెచ్ రామాంజనేయులు, సి.శ్రీనివాసులు, ఎ.వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా మారుతీప్రసాదరెడ్డి, శంకరనాయుడు, డీసీ ఫక్కీరప్ప, టి.షాన్వాషా, జి.ఆదిశేఖరరెడ్డి, కోశాధికారులుగా ఎం.రామ్మోహన్, రత్నకుమారితో పాటు 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. 98–డీఎస్సీ అభ్యర్థుల 24 ఏళ్ల సమస్యను పరిష్కరించి ఉద్యోగాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయంలో విగ్రహాల ధ్వంసం



ధ్వంసమైన పార్వతీదేవి విగ్రహం

శెట్టూరు: మండల కేంద్రంలో కొలువైన పురాతన శివాలయంలో సోమవారం అర్ధరాత్రి పార్వతీదేవి, నంది విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం కొందరు భక్తులు ఆలయానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన వెలుగు చూసింది. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ యువరాజ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుప్త నిధుల కోసం దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టారా? లేదా ఆకతాయిలు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ దుశ్చర్యకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

జేసీ అనుచరులపై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: సోషల్ మీడియాలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి అనుచరులపై పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. జేసీ యువసేన పేరుతో గండికోట కార్తీక్, విజయ్ రాయల్ ఫేస్ బుక్ ఖాతా తెరిచి సోమవారం ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టింగ్ పెట్టారు. ఈ విషయాన్ని గమనించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వై.గురుశంకర్ ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం కార్తీక్, విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

బోధనాసక్తి గల టీచర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడు రూరల్: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ తోటగేరిలోని అప్‌గ్రేడ్ బాలికల ఉన్నత పాఠశాల (ప్లస్)లో వివిధ తరగతుల బోధనకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల (పీజీటీ) నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం జిల్లా డీఈఓ సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు అర్హులు. ఆసక్తి గల ఉపాధ్యాయులు తగిన విద్యార్హత ప్రతులు జత చేసిన దరఖాస్తును ఈ నెల 10వ తేదీలోపు ఉప విద్యాశాఖ అధికారికి అందజేయాలి.

అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: మహిళల్లో రక్తహీనత, బాలబాలికల్లో పౌష్టికాహార లోపం, బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీ వంటి సామాజిక సమస్యలను సమూలంగా నిర్మూలించాలంటే ముందుగా అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతం కావాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆమె సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీల ప్రాధాన్యత పెరిగిందన్నారు. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీ నివారణకు కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా బాలల పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, సీడీపీఓలు, ఏసీడీపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం అండ

- లైంగిక వేధింపులపై కమిటీ ఏర్పాటు
- రీజనల్ చైర్‌పర్సన్‌గా మంజులకు బాధ్యతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు గతంలో ఉన్న చట్టాన్ని(1999) మరింత బలోపేతం చేస్తూ రీజియన్ (8 జిల్లాలు) స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఆ సంస్థ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజులకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తానంటూ ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి సంఘం నాయకుల నిరసన


నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాప్తాడురూరల్: నిబంధనలకు విరుద్ధంగా కళాశాల పేరుతో ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. మంగళవారం నగరంలోని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈ కుళ్లాయిస్వామి, బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్, ఏఐఎస్బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ మాట్లాడారు. మెటీరియల్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభ పెడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు సమీర్, హేమంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

13న రక్తదాన శిబిరం

అనంతపురం కల్చరల్: ప్రఖ్యాత ఆధ్యాత్మిక, యోగా గురువు రవిశంకర్‌గురూజీ జన్మదినం సందర్భంగా ఈనెల 13న స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సెంటర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అమేయ టవర్ ప్రాంగణంలో జరిగే శిబిరంలో పాల్గొనే గురూజీ శిష్యులు ముందుగా 7330884066 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆదిలక్ష్మి సేవలు అభినందనీయం


ఆదిలక్ష్మిని సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: రాయదుర్గం గ్రంథాలయ శాఖలో గ్రేడ్–1 గ్రంథాలయ అధికారిగా పనిచేస్తున్న కే ఆదిలక్ష్మిని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఆదిలక్ష్మి పదోన్నతిపై ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌తోపాటు జిల్లా కార్యదర్శి పి. రమ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి సన్మానించారు. గ్రంథాలయ సంస్థకు ఆదిలక్ష్మి చేసిన సేవలను కొనియాడారు.

ప్రణాళిక కార్యదర్శికి మెమో

అనంతపురం క్రైం: 52వ సచివాయలంలో పనిచేస్తున్న పట్టణ ప్రణాళిక కార్యదర్శి లోకేష్‌కు నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం మెమో జారీ చేశారు. రాంనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా, సకాలంలో ఆ ఫైల్ పూర్తి చేయకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైల్వే సామగ్రి కొనుగోలు కేసులో మరో ముగ్గురి అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

అనంతపురం సిటీ: రైల్వే స్లీపర్స్(ఇనుప సామగ్రి) చోరీ కేసులో మరో ముగ్గురిని రైల్వే అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులు కాగా, ఇటీవల కీలక నిందితుడితో పాటు ఆరుగురు కూలీలను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో తప్పించుకు తిరుగుతున్న అనంతపురానికి చెందిన మీసాల రాముడు (రాంనగర్), భీంరెడ్డి(రుద్రంపేట), రఘునాథగౌడ్ (వేణుగోపాల్‌నగర్)ను మంగళవారం అరెస్టు చేసి, 71 స్లీపర్స్ (మొత్తం 10 టన్నులు)ను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ రవిప్రకాష్, ఆర్పీఎఫ్ క్రైం బ్రాంచ్ సీఐ కొదమల బినాయ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి


వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ వీరబ్బాయి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి పేర్కొన్నారు. మంగళవారం రేకులకుంట గ్రామంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. క్లినిక్‌లో వైద్య సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. 104 వాహనంలో ఉన్న మందులను పరిశీలించారు. 104 వాహనం ద్వారా ప్రజలకు అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. రోజూ వస్తున్న టెలీకన్సల్టేషన్ కాల్స్‌ను పరిశీలించారు. కొర్రపాడు డాక్టర్ వినోద్‌కుమార్, సీహెచ్ఓ రామకృష్ణ పాల్గొన్నారు.

'మానసిక' వేదన

- రోగులకు వార్డు కేటాయింపు ప్రశ్నార్థకం
- డీ అడిక్షన్ సెంటర్‌లోని 12 పడకల్లోనే సేవలు
- గతంలో ఉన్న వార్డు కోవిడ్ కేసులకు కేటాయింపు


డీ అడిక్షన్ సెంటర్‌లో అడ్మిషన్‌లో ఉన్న రోగులు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మానసిక రోగులకు వార్డు కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. సరిపడా వార్డు లేక రోగులు.. ఇటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో డీ అడిక్షన్ సెంటర్‌లోని 12 పడకల్లోనే వార్డులోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో కేటాయించిన వార్డులో కోవిడ్ పాజిటివ్ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. మానసిక రోగులకు ప్రత్యేక వార్డు అనివార్యమైంది. అధికారుల పాలనాపరమైన వైఫల్యంతోనే సమస్య తలెత్తినట్లు ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

మానసిక వైద్య విభాగంలో ప్రతి నెలా 1,500 వరకు ఔట్ పేషెంట్లు, 40 నుంచి 50 మంది వరకు ఇన్ పేషెంట్లు ఉంటున్నారు. గతంలో ఈఎన్‌టీ వార్డు ఎదురుగా మానసిక రోగుల వార్డు ఉండేది. జీప్లస్ 2 భవనం ఏర్పాటులో భాగంగా వార్డును కూల్చివేశారు. దీంతో రోగులను ఐడీ వార్డుకు షిఫ్ట్ చేశారు. కోవిడ్ సమయంలో ఐడీ వార్డును కోవిడ్ రోగులకు కేటాయించారు. కోవిడ్ కేసులు పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టాక యధావిధిగా మానసిక వైద్య విభాగానికి వార్డును కేటాయించారు. ఇటీవల మరోసారి ఒకటి రెండు కోవిడ్ కేసులు రావడంతో పాత ఐడీ వార్డులోనే కోవిడ్ కేసులను ఉంచేలా ఆస్పత్రి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మానసిక రోగులు తిరుగుతూ ఉంటారని, ఇటువంటి సమయంలో ఇబ్బంది తలెత్తుతుందని కొన్ని నెలల నుంచి డీ అడిక్షన్ సెంటర్‌లోనే రోగులకు వైద్యం అందించేలా మానసిక వైద్య విభాగం వైద్యులు చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక వార్డు అనివార్యం:

మానసిక వైద్య విభాగంలో గత నాలుగు నెలల్లో 6,723 మంది ఓపీ, 243 ఐపీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత రోజుల్లో మానసిక సమస్యలతో పాటు మద్యం, గుట్కా, గంజాయి తదితర వ్యవసనాలకు బానిసలుగా మారుతున్నారు. ఇలాంటి కేసులే అధికంగా ఉన్నాయి. తీవ్రమైన సమస్యతో బాధపడే వారిని తప్పక వార్డులో చేర్చి, చికిత్స అందించాల్సి ఉంది. యూనిట్‌కు 30 పడకలు మంజూరైనా, డీ అడిక్షన్ సెంటర్‌లోనే రోగులను ఉంచాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో ప్రత్యేక వార్డు కేటాయింపు అనివార్యమైంది. కోవిడ్ కేసులు చాలా అరుదుగా నమోదవుతుండడంతో ఉన్న కేసులను గతంలోలాగానే చెస్ట్ వార్డులో కేటాయించి, ఐడీ వార్డును పూర్తిగా మానసిక రోగులకు వార్డుగా కేటాయిస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యం అందుతుంది.


కోవిడ్ రోగులకు కేటాయించిన పాత ఐడీ వార్డు ఇదే

కోవిడ్‌తోనే ఖాళీ చేశారు

పాత ఐడీ వార్డులోని కోవిడ్ బాధితులకు కేటాయించడంతో మానసిక వైద్య విభాగం వార్డును ఖాళీ చేశారు. ప్రస్తుతం డీ అడిక్షన్ సెంటర్‌లోని 12 పడకల్లోనే వార్డును నిర్వహించాల్సి వస్తోంది. నూతన భవనం ఏర్పాటయ్యాక మానసిక రోగులకు ప్రత్యేక వార్డు కేటాయిస్తాం.

– డాక్టర్ రఘునందన్, సూపరింటెండెంట్, జీజీహెచ్

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: నగరంలోని ఆరో డివిజన్‌లో వేణుగోపాల్‌నగర్‌లో బుధవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయలం ఓ ప్రకటన విడుదల చేసింది. వేణుగోపాల్‌నగర్‌లోని పీవీకేకే కళాశాల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్యాంపస్ మహిళా హాస్టళ్లలో చోరీలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గోదావరి మహిళా వసతి గృహాల్లో మంగళవారం ఉదయం చోరీలు జరిగాయి. విద్యార్థినులు ఉదయం తరగతులకు వెళ్లిన తర్వాత మహిళా వసతి గృహంలోని ఏడు గదుల్లో చోరీ జరిగింది. విద్యార్థినులు దాచుకున్న పాకెట్ మనీ, చిన్నచిన్న వస్తువులు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. మొత్తం రూ.7 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు వర్సిటీ అధికారులు ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తే చోరీకి పాల్పడింది బయటి వ్యక్తులా? స్థానికంగా పనిచేసే వారా అనే విషయం స్పష్టత రానుంది.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచండి


ఈఓపీఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

రాప్తాడు: వేతనాలు పెంచాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రసన్నాయపల్లి పంచాయతీ కార్మికులు గ్రామ సచివాలయం దగ్గర ఆందోళన చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు పలుకుతూ ధర్నాలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 2018 వరకు మాత్రమే వేతనాలు పెంచారని, ఏడాదికోక సారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారానికి రెండు రోజులు సెలవు ప్రకటించి, పనిముట్లు సక్రమంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, సహాయ కార్యదర్శి నాగరాజు, పంచాయతీ కార్మికులు క్రిష్టయ్య, లక్ష్మీదేవి, ఉన్నమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు


గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

అనంతపురం సిటీ: అనంతపురం రెయిన్‌బో మాంటిస్సోరి ప్రీ స్కూల్‌లో 'ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్' ఆధ్వర్యంలో సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీలు మంగళవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 34 మంది క్రీడాకారులు తరలివచ్చి పాల్గొన్నారు. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం ఆరు రౌండ్ల పోటీలు నిర్వహించారు. వీరిలో అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు(ప్రథమ స్థానం), వెంకటకృష్ణ సుధీంద్ర (ద్వితీయ), వి.విశ్వనాథ్ (తృతీయ), ఎంపీ సహృద్ (నాలుగో స్థానం) గెలుపొందినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు టోర్నమెంట్ చీఫ్ అర్బిటర్ శివకృష్ణ, ఆర్గనైజింగ్ కన్వీనర్ డాక్టర్ సుప్రజా చౌదరి తెలిపారు.

అనంతలో రేపటి నుంచి పోటీలు

అనంతపురంలోని రెయిన్‌బో మాంటిస్సోరి ప్రీ స్కూల్‌లో గురువారం నుంచి 15 వరకు ఏఐసీఎఫ్ చెస్ ఫర్ ఎవరీవన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్–2023 పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుప్రజా చౌదరి, టోర్నమెంట్ కోఆర్డినేటర్ గోవిందరాజులు తెలిపారు. అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్, అఖిల భారత చదరంగం సమాఖ్య, ప్రపంచ చదరంగం సమాఖ్య వారి సౌజన్యంతో పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

వాహనదారులకు హెల్మెట్ అత్యవసరం


రహదారి నిబంధనలు తెలియజేస్తున్న పోలీసులు

కనగానపల్లి: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రం కనగానపల్లిలో రోడ్డు ప్రమాదాలు నివారణ, రహదారి నిబంధనలపై రవాణా, పోలీస్ అధికారులు వాహదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి హిందూపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీవీ రమణ హాజరై, రహదారి నిబంధనలను తెలియజేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనంలో ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. వాహనదారులు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వాహనదారులు పాల్గొన్నారు.

మహిమాన్వితం బీబీ ఫాతిమా చరితం

- రేపు మకానం వద్ద యాభైఏళ్ల సంబరాలు


భక్తుల పొర్లు దండాలు (ఫైల్)

అనంతపురం కల్చరల్: ఐదోరోడ్డులో వెలసిన బీబీ ఫాతిమాగా పూజలందుకునే పీర్ల మకానం మహిమాన్వితంగా అందరూ భావిస్తారు. నగరంలో సాగే పీర్ల పండగకు యాభై ఏళ్లు వచ్చేశాయి. ఈనెల 11న యాభై ఏళ్ల సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఐదోరోడ్డులో 1977 నుంచి పీర్ల మకానంలో బీబీ ఫాతిమా ఉరుసు ఉత్సవాలు ఏటా 12 రోజుల పాటు జరుగుతాయి. పీర్ల పండుగ, అగ్ని ప్రవేశాలు, చిన్న, పెద్ద సరిగెత్తులతో సందడిగా ఉంటుంది.భక్తులు చందాలు వేసుకొని మొదట ఉత్సవం నిర్వహిస్తారు. కాలక్రమంలో తొలిసభ్యులు హనుమంతు, ములకన్న, తిప్పయ్య, నబీరసూల్‌తోపాటు మరో 85 మంది సభ్యులతో కమిటీ ఏర్పడి, వైభవంగా ఉత్సవం జరుపుతారు. ఇక్కడ జరిగే చిన్నపీర్ల పండగకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి, మొక్కులు తీర్చుకుంటారు. సంతానం లేని వారు వచ్చి, కోర్కెలు అడిగి వెళ్తుంటారు. చక్కెర చదివింపులు ఉంటాయి. వేలాది మందికి అన్నదాన సంతర్పణ ఉంటుంది.

సవీరాలో అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం క్రైం: నగరంలోని కిమ్స్ సవీరా వైద్యులు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సర్జన్ డాక్టర్ దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాకు చెందిన 54 ఏళ్ల ఓ వ్యక్తి రీనల్ హైడాటిడ్‌సిస్ట్ (5 లక్షల మందిలో ఒకరికి వచ్చే అరుదైన జబ్బు)తో బాధపడుతూ గతనెల 29న ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఇంట్లో కుక్కలు పెంచుకునేవారు, ఆహార నియమాలు పాటించని వారికి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, వక్షస్థలం, థైరాయిడ్, మెడ భాగంలో హైడాటిడ్‌సిస్ట్ వ్యాధి వస్తుందన్నారు. అతన్ని పరీక్షించగా, మూత్రపిండ వద్ద పెద్ద పరిమాణంలో హైడాటిడ్ సిస్ట్ ఉంది. మే 2న డాక్టర్ దుర్గాప్రసాద్, యురాలిజిస్టు డాక్టర్ నరేంద్రనాథ్, చీఫ్ ఎనలిస్ట్ డాక్టర్ రవిశంకర్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌లు శస్త్రచికిత్స చేసి హైడాటిడ్ సిస్ట్, కుడి మూత్రపిండాన్ని తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

15 నుంచి వేరుశనగ విత్తనం కోసం నమోదు చేసుకోండి

శింగనమల: వేరుశనగ విత్తనం కోసం ఈనెల 15 నుంచి ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని ఏఓ చిన్నమ్మ రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఆర్బీకేలో వేరుశనగ విత్తనం నిల్వకు గోదాములు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బ్యాగులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కే6 ఒక బ్యాగు పూర్తి ధర రూ.9,300 కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.3,720 పోను రూ.5,580 చెల్లించాలన్నారు.


దశాబ్దాల కల సాకారం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


నీరుగంటి వీధిలో సంక్షేమ లబ్ధిపై స్థానికులతో ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: అనంతపురం అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో దశాబ్దాల కల సాకారమైందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగిన వెంటనే రూ.వందల కోట్లు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆరో డివిజన్‌లోని నీరుగంటి వీధిలో కార్పొరేటర్ సుజాత, సచివాలయ కన్వీనర్లు రమాదేవి, కేవీ సుబ్బారెడ్డిలతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర జనాభా 5 లక్షలు, రూరల్‌లో 2 లక్షల మంది ఉన్నారన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అనంతపురం అర్బన్, రూరల్ మండలాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోందన్నారు. రూ.312 కోట్లతో ఫోర్‌వే బ్రిడ్జ్, నగరపాలక సంస్థకు ప్రత్యేకంగా రూ.25 కోట్ల మంజూరు చేశారన్నారు. తడికలేరు నుంచి గుత్తి రోడ్డు వరకు రూ.58 కోట్లతో రోడ్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు, ఆర్థిక సంఘం నిధులతో నగరం నలుదిక్కులా అభివృద్ధి జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో 97 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. అనంతరం డివిజన్‌లో సీఎం ప్రత్యేక నిధుల ద్వారా త్రివేణి, ఎస్వీ థియేటర్ల ముందు రూ.70 లక్షలతో సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, ఎంఎల్‌ఓ డాక్టర్ దామోదర్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు పెన్నోబులేసు, యోగి, తనీష, జావెద్, రాధాయాదవ్, ఉషా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బాట మారెమ్మస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మారెమ్మ దేవత

కనగానపల్లి: మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ స్వామికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఉత్సాహంగా తప్పెట పోటీలు

నార్పల: మండల కేంద్రంలో స్థానిక అంబేడ్కర్ కాలనీలో మంగళవారం తప్పెట పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. తప్పెట శబ్దం వినిపించకపోతే వినోదం, సమాచారం ఆగిపోతుందన్నారు. అనంతరం గెలుపొందిన వారికి వారు బహుమతులు అందించారు. సర్పంచు మన్నీల సుప్రియ, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, ఎస్సీ, ఎస్టీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూషణ్‌రెడ్డి, శివయ్య, గోపాల్, నిర్వాహకులు రాము, నల్లప్ప, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్

కడప అర్బన్: జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.16 లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల టౌన్ సుందరయ్య నగర్‌కు చెందిన మల్లెపోగు ప్రసాద్, మైలవరం మండలం బుబుసానిపల్లెకి చెందిన గువ్వల పుల్లారెడ్డి, ఎర్రగుంట్ల అంబేడ్కర్ నగర్‌కు చెందిన దండు నరసింహులు, ప్రకాష్‌నగర్‌కు చెందిన పిక్కిలి చరణ్‌కుమార్... సీసీ కెమెరాలు లేని ప్రదేశంలో పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చేసుకుని మారు తాళాలతో అపహించుకెళ్లేవారు. వైఎస్సార్ జిల్లాతోపాటు, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాలు, తెలంగాణా, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఆరు నెలల వ్యవధిలోనే 25 మోటార్ సైకిళ్లను దొంగలించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లితో పాటు సి.కొత్తపల్లెలో రెండు, అనంతపురం 4వ పట్టణ పోలీస్‌స్టేషన్, గుంతకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు మోటార్ సైకిళ్లు దొంగలించినట్లు విచారణలో తేలింది. నిందితులను ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఎర్రగుంట్ల టౌన్ సమీపంలో అదుపులోకి తీసుకుని 21 మోటార్ సైకిళ్లను రికవరీ చేశారు.

విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేయండి


ఆర్‌బీకే అసిస్టెంట్లతో సమావేశమైన రూరల్ ఏవో పి.వెంకటేశ్వర ప్రసాద్ యాదవ్

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ఖరీఫ్ ప్రారంభం కానున్న రాయితీ విత్తన పంపిణీకి సిద్ధం చేయాలని రూరల్ ఏవో పి.వెంకటేశ్వరప్రసాద్ యాదవ్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కృషిభవన్‌లో ఆర్‌బీకే అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విత్తన వేరుశనగకు 40 శాతం, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలపై 50 శాతం రాయితీ వర్తింపజేసిందన్నారు. విత్తన పంపిణీ ప్రక్రియ ప్రారంభమైనందున ఆర్‌బీకేల వారీగా పంటల సాగు ప్రణాళిక, విత్తనం ఎంత అవసరమనేదానిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటించి, సరఫరా అయిన విత్తన కాయలను రైతుల ఆమోదంతో నిల్వ చేయాలన్నారు. నాసిరకం ఉంటే నిరభ్యంతరంగా వెనక్కి పంపాలన్నారు. వర్షాలు పడుతున్నందున వేసవి దుక్కులు, విత్తన పంపిణీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో చందన, ఏఈవోలు సుజిత, ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో కారుణ్య నియామకాలు


ఉద్యోగ నియామక పత్రాలను అందిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇద్దరికి కారుణ్య నియామకాలు కల్పించారు. ఎస్ వెంకట రామన్ క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీలో అసిస్టెంట్ బైండర్‌గా పని చేసేవారు. అనారోగ్యంతో మృతిచెందారు. వెంకటరామన్ కుమార్తె కృతికకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. వర్సిటీలో హెల్పర్‌గా పని చేస్తున్న ఎర్రిస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు బి. భరత్ కుమార్‌కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కల్పించారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, బోధనేతర సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, కార్యదర్శి శాంతిలింగం, వైస్ ప్రెసిడెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు

గుత్తి: పామిడి, పెద్దవడుగూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం రమేష్, డీఈ సురేంద్ర అన్నారు. గుత్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో డీఎం కార్యాలయంలో మంగళవారం ఔత్సాహిక వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23లోపు టెండర్లు దాఖలు చేయాలన్నారు. టెండర్ ఫారాలు కడపలోని ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలన్నారు.